క్లుప్తంగా

పంచాయతీ కార్మికులకు యూనిఫాం పంపిణీ



అచ్చంపేట: మండలంలోనే అత్యధిక జనాభా కలిగిన అచ్చంపేట గ్రామ పంచాయతీలో పనిచేసే 20మంది పారిశుధ్య కార్మికులకు మంగళవారం సర్పంచ్ షేక్ జాని, మాజీ సర్పంచ్ కంబాల వీరబాబులు ఒక్కొక్కరికి రెండు జతల చొప్పున యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా పంచాయతీ సిబ్బందికి యూనిఫాం పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. మాజీ సర్పంచ్ కంబాల వీరబాబు మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు, కార్యాలయ సిబ్బంది రోజాప్రసాద్, శ్రీనివాస్, ప్రకాష్, దేవదానం, చెంచయ్య, చంద్రం, బాబూరావు, బాబు, పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

బెల్లంకొండ: గ్రామాల్లో పారిశుద్య నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీఓ బి.వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని మండల పరిషత్ కార్యాయలంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు రెండవ రోజు శిక్షణా తరగతులను నిర్వహించారు. తొలుత జాతిపిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జాతీయస్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో పేట విద్యార్థులు సత్తా

విజేతలను అభినందించిన పలువురు పెద్దలు

చిలకలూరిపేట: జాతీయస్థాయిలో మార్షల్ ఆర్ట్స్‌లో పట్టణ వాసులు సత్తాచాటారు. సాయి సెల్ఫ్ డిఫెన్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఫౌండర్ వెంకట్ ఆధ్వర్యంలో విజయవాడచెన్నుపాటి రామలింగయ్య మునిసిపల్ కార్పొరేషన్ ఇండోర్ స్టేడియంలో ఇటీవల జాతీయస్థాయి కుంగ్‌ఫూ, కరాటే పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పట్టణంలోని సీఆర్‌క్లబ్‌లోని న్యూషావోలిన్ కుంగ్‌ఫూ అకాడమీ, పోలిరెడ్డిపాలెంలోని రెండోబ్రాంచ్ విద్యార్థులు పాల్గొన్నారు. ఆయా పోటీల్లో పేట విద్యార్థులు అద్భుత ప్రతిభను చాటి అకాడమీ నుంచి 20 మంది, బ్రాంచ్ నుంచి ఐదుగురు విద్యార్థులు కటా విభాగంలో 18 బంగారు, 5 రజత, 2 కాంస్య పతకాలు సాధించారు. అలాగే బ్రౌన్ బెల్ట్ స్పారింగ్‌లో సయ్యద్ మొహమ్మద్ తన్వీర్ ఓవరాల్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను కై వసం చేసుకున్నారు. పతకాలు సాధించిన వారిలో పవన్ కుమార్, ఎస్తేరు రాణి, పూజిత, శ్రీవత్సవ్, గౌరి, తాహీర్, తేజ, మోహాక్, రిత్విక, పమైలా, గౌతమ్, హమీద్ బాషా తదితరులు ఉన్నారు. స్థానిక సీఆర్‌క్లబ్ ఆవరణలో మంగళ వారం అభినందన సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విజేతలతో పాటు క్లబ్ పెద్దలు సాధినేని హనుమంతరావు, నర్రా కాళిదాసు, డాక్టర్ చేబ్రోలు మహేష్, వైద్యులు లావు సతీష్, ఎం వంశీకృష్ణ, స్వర్ణ శ్రీనివాస్ సత్కరించి బహుమతుల్ని అందజేశారు. కార్యక్రమంలో అకాడమీ చీఫ్ షేక్ దరియావలి, మాస్టర్‌లు బత్తుల విక్రమ్, యడ్ల సురేష్, పాలపాటి నాగరాజు, కొరప్రాటి రాంబాబు, షేక్ రబ్బాని, ఎం దుర్గా ప్రసాద్, కె రాహుల్, బ్లాక్ బెల్టర్స్ సాకేత్, సుధీర్, ఖమృద్దీన్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిదో తరగతి విద్యార్థి అదృశ్యం

నాదెండ్ల: మండల కేంద్రమైన ఎస్సీ కాలనీకి చెందిన తొమ్మిదో తరగతి చదువుతున్న పద్నాలుగేళ్ళ విద్యార్థి దావులూరి జాన్ సోమవారం ఉదయం కనిపించకుండా పోయాడని తండ్రి చినవీరయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు చిన వీరయ్య కూలి పనులు చేసుకుంటూ ఇరువురు కుమారులను చదివిస్తున్నాడు. పెద్దకుమారుడు గుంటూరు సమీపంలోని ఓ అకాడమీలో చదువుతుండగా, రెండో కుమారుడు జాన్ నాదెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. సోమవారం ఉదయం అన్న వద్దకు వెళ్ళి తిరిగి ఇంటికి వచ్చాడు. 11 గంటల సమయంలో బైక్ తీసుకుని వెళ్ళి తిరిగి రాలేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీ ఫీల్డ్ విజిట్

ఈపూరు: గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా 2వ రోజు ఎస్‌డబ్ల్యూపీసీ ఫీల్డ్ విజిట్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో ఎ.వి.రంగనాయకులు పాల్గొని వర్మికంపోస్టు తయారు చేసే విధానం గురించి అవగాహన కల్పించడం జరిగింది. పంచాయతీల్లో సంపదను ఎలా సృష్టించాలో వివరించారు. కార్యక్రమంలో విస్తరణాధికారి జి.వెంకటేశ్వర్లు, ఏవో రవికుమార్, క్లాప్ మిత్రలు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

రొంపిచర్లలో ఓ మోస్తరు వర్షం

రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో ఓ మోస్తరు నుండి భారీ వర్షాలు కురిశాయి. మంగళవారం ఉదయానికి మండల కేంద్రమైన రొంపిచర్లలో 4.4 ఎంఎం వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయ అధికారులు తెలిపారు.

శుద్ధితో దిగుబడులు వృద్ధి

- విత్తనశుద్ధితో చీడపీడల నుంచి రక్షణ
- తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు

సత్తెనపల్లి: పంటల సస్యరక్షణలో మేలైన ప్రక్రియ విత్తన శుద్ధి. కీలక ప్రక్రియగా పేర్కొనే ఈ విత్తనశుద్ధితో తొలిదశలో ఆశించే పురుగులు, తెగుళ్ల భారీ నుంచి పంటలను కాపాడుకోవచ్చు. భూమిని దున్నడం ఎంత ముఖ్యమో శుద్ధి చేసిన విత్తనాన్ని వాడటం అంతే ప్రధానం. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించడానికి విత్తన శుద్ధి కీలక ప్రక్రియ. దీనివల్ల చీడపీడల ఉధృతి తగ్గించి, పంట దశలో ఆశించే రసం పిలిచే పురుగులు, వైరస్‌ల నుంచి పంటలను కాపాడుకోవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. కోత కోసేటప్పుడు, నూర్పిడి జరిగేటప్పుడు కొన్ని శిలీంద్ర భాగాలు విత్తనాలతో కలిసి పంటను ఆశిస్తాయి. విత్తనాలలో తెగుళ్లను కలుగజేసే సూక్ష్మ క్రిములు బీజాల రూపంలో ఉండి తిరిగి విత్తనాలను నాటినప్పుడు చీడపీడల రూపంలో బయట పడతాయి. సాధారణంగా రైతులు పైరుకు తెగుళ్లు ఆశించినప్పుడు మాత్రమే శిలీంద్ర రసాయనాలను పిచికారీ చేస్తారు. తెగుళ్ల ప్రారంభ దశలోనే గమనించక పోవడం, సకాలంలో సస్యరక్షణ చేపట్టకపోవడం వల్ల తెగుళ్ల నివారణ రైతులకు కష్టసాధ్యమవుతుంది. విత్తనం మంచిదైతేనే పంట బాగుంటుంది. కాబట్టి కనిపించని శిలీంద్రాల బారి నుంచి పలు విత్తనాలను రక్షించుకోవాలంటే విత్తన శుద్ధి ఆవశ్యకత ఎంతో ఉంది.



భృగుబండలో విత్తనశుద్ధి చేస్తున్న రైతులు (ఫైల్)

విత్తన శుద్ధి అంటే...

విత్తనాల ద్వారా ఆశించే పురుగులు, తెగుళ్లను నివారించడం .. మొలక దశలో నేలలో కీటకాలు, శిలీంద్రాల నుంచి విత్తనాలను కాపాడటానికి విత్తనాలను సరైన పద్ధతిలో శుద్ధి చేయడాన్ని విత్తన శుద్ధి అంటారు.

విత్తన శుద్ధి వలన ప్రయోజనాలు..

- విత్తనాన్ని శుద్ధితో విత్తనాలను ఎక్కువ కాలం నుంచి మొలకెత్తే విత్తనాలను, చిరు మొక్కలను కాపాడుతుంది
- ఎక్కువ విత్తనాలు మొలకెత్తుతాయి
- త్వరగా ఒకే రీతిలో మొలకలు వచ్చి ఎదుగుతాయి
- పప్పు జాతి పంటలలో ఎక్కువ కణుపులు రావడానికి తోడ్పడుతుంది
- భూమిలో కాని, మొక్కలకు కాని మందు చల్లడం కంటే మెరుగైనది
- ప్రతికూల పరిస్థితుల్లో కూడా (గాలిలో తేమ శాతం తక్కువగా/ఎక్కువగా ఉన్నప్పుడు కూడా) పంట ఒకే తీరులో ఉంటుంది
- నేల ద్వారా వ్యాపించే తెగుళ్లు, పురుగులను సమర్థంగా నివారించడానికి దోహద పడుతుంది
- మందులు విత్తనంలోకి చొచ్చుకుపోయి శిలీంద్రాలను నాశనం చేస్తాయి

అనుసరించవలసిన విధానం

- కిలో విత్తనానికి మూడు గ్రాముల కార్బండిజమ్ లేదా 2.5 గ్రాముల మాంకోజెబ్ కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి
- జీవ రసాయనాలతో మరోసారి శుద్ధి చేయాలి
- గింజ పగలకుండా, పైపొర పోకుండా జాగ్రత్త తీసుకోవాలి
- శుద్ధి చేసేటప్పుడు చేతులకు గ్లౌజులు, ముఖానికి గుడ్డ కట్టుకోవాలి

విత్తన శుద్ధితో మంచి దిగుబడి



విత్తన శుద్ధితో మంచి దిగుబడి సాధించవచ్చు. దీనివల్ల చీడ పీడలను ఎదుర్కొనే సామర్థ్యం మొక్కలకు ఏర్పడుతుంది. ఎరువులు, పురుగుమందుల ఖర్చు తగ్గుతుంది. నాణ్యమైన దిగుబడి సాధించడం వల్ల మార్కెట్‌లో పంట ఉత్పత్తులకు మంచి ధర లభిస్తుంది. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు రైతులు పాటిస్తే వ్యవ సాయం లాభసాటిగా మారుతుంది.

–ఎస్.శ్రీధర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ సహాయ వ్యవసాయ సంచాలకులు, సత్తెనపల్లి

ఘనవ్యర్థాల మేనేజ్‌మెంట్‌పై శిక్షణ

ఉయ్యందన(క్రోసూరు): ఘనవ్యర్థాల మేనేజ్‌మెంట్ పై శిక్షణా కార్యక్రమం సందర్భంగా మంగళవారం ఉయ్యందన గ్రామంలోని ఘన వ్యర్థాల సంపద సృష్టి కేంద్రాన్ని పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు సందర్శించారు. పంచాయతీ కార్యదర్శులకు, గ్రామాల సర్పంచ్‌లకు మూడు రోజుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు సాలిడ్ మేనేజ్‌మెంట్ ఏవిధంగా చేయాలో క్షేత్రస్థాయిలో తెలియపరిచేందుకు ఉయ్యందన గ్రామంలోని వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్డును సందర్శించారు. ఈసందర్భంగా తడి పొడి చెత్త ఎలా గ్రేడింగ్ చేయాలి, తడిచెత్తతో ప్రయోజనాలు ఏవిధంగా పొందవచ్చు. సంపద ఏవిధంగా పొందవచ్చు. అదేవిధంగా పొడి చెత్తలో లభించే పలురకాల వ్యర్థాలతో ఏవిధంగా ఆదాయం పొందవచ్చనే విషయాలపై రిసోర్సు పర్సన్లుగా వ్యవహించిన అందుకూరు కార్యదర్శి టి.రత్నరాజు, 88త్యాళ్లూరు కార్యదర్శి పీవీ రమేష్, విప్పర్ల కార్యదర్శి జే.ప్రకాశ్, గరికపాడు కార్యదర్శి సీహెచ్ శేషగిరి పాల్గొని వివరించారు.



ఉయ్యందన ఘనవ్యర్థాల షెడ్డులో చెత్త గ్రేడింగ్ చేయటం చూపిస్తున్న గ్రీన్ అంబాసిడర్లు



ఇరుకుపాలెంలో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ రూపవతి, సర్పంచ్‌లు

ముప్పాళ్ళ: మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ అభివృద్ధి ప్రణాళిక తయారీపై రెండోరోజు సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు మంగళవారం రెండవ రోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో భాగంగా ఇరుకుపాలెం, చాగంటివారిపాలెం, గోళ్ళపాడు గ్రామాల్లోని చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో తడి, పొడి చెత్త కుండీల నిర్వహణను పరిశీలించారు. కేంద్రంలో వినియోగించే పరికరాలు, రిజిష్టర్లు నిర్వహణపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ కార్యాలయ ఏఓ శ్రీనివాసరావు, హెల్త్ సూపర్‌వైజర్ పీటర్ డేమియన్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రాజుపాలెం: మండలంలోని కోటనెమలిపురి, రాజుపాలెం గ్రామాలలో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ల నిర్మాణం జరిగిందని, వాటిని వాడకంలోకి తేవాలని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణప్రసాద్ తెలిపారు. కోటనెమలిపురి ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లలో సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు షెడ్‌ల నిర్వాహణపై అవగాహన సమావేశం సోమవారం నిర్వహించారు. ఐటీసీ సెర్ప్ ప్రతినిధులు బొల్లయ్య, సతీష్, గురుప్రసాద్, ఈవోపీఆర్డీ ముక్కంటి తదితరులు ఉన్నారు.

పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలి

ఉయ్యందన(క్రోసూరు): పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో మంగళవారం డిమాండ్ చేశారు. మండలంలోని ఉయ్యందన గ్రామ పంచాయతీలో ఘనవ్యర్థ పదార్థాల షెడ్ల ఉపయోగం గురించి ,గ్రామంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు నిర్వహించిన శిక్షణా సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం అధికారులను కలుసుకుని పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని అర్జీని అందచేశారు. కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ఏపూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏప్రిల్ నుంచి 5 నెలలుగా పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామాభివృద్ధి గురించి ప్రభుత్వాలు ఎన్ని కార్యక్రమాలు చేపట్టినప్పటికీ పంచాయతీ కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించడం ద్వారానే పంచాయతీ అభివృద్ధి జరుగుతుందని, వెంటనే పంచాయతీ వర్కర్ల సమస్య పరిష్కరించాలని కోరారు. ఉయందన పంచాయతీ సెక్రటరీ, మండల పంచాయతీ విస్తరణాధికారికి అర్జీ అందజేశారు. నీలం కృష్ణయ్య, మంగయ్య తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శికి అర్జీని అందజేస్తున్న వ్యవసాయ కార్మికసంఘం ప్రతినిధులు

ఉచిత పశువైద్య శిబిరం

శావల్యాపురం: రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పశువైద్యశాల పరిధిలో గర్భకోశ వ్యాధుల చికిత్స పశువైద్య శిబిరం నిర్వహించారు.ఈ శిబిరంలో పశువైద్యాధికారులు సోముల గుణధీర్, పాలపర్తి గణేష్ కుమార్‌లు పాల్గొని 32 పాడి గేదెలకు గర్భకోశ వ్యాధులు పరీక్షలు నిర్వహించి మినరల్ మిక్చర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈశిబిరంలో వెటర్నరీ అసిస్టెంట్ బుల్లె య్య, సుందరయ్య, ఏహెచ్ఏ బలరాం, ట్రైనీ ఏహెచ్ఏ మేఘన, బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.

విధులు-నిధులు తెలుసుకోండి

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల గ్రామంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గ్రామ సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు రీఫ్రెషర్ ట్రైనింగ్ క్లాసులు 2వ రోజు నిర్వహించారు. శిక్షణలో ఎంపీడీవో టి.వీరభద్రాచారి పాల్గొని మాట్లాడుతూ కార్యదర్శులు, సర్పంచ్‌ల విధులు, నిధులు గురించి, అధికారాల గురించి తప్పనిసరిగా తెలుసుకొని ఉండాలని తెలిపారు. గ్రామాల్లో గ్రామసభల నిర్వహించి గ్రామాభివృద్ధికి తోడ్పడేలా చూడాలన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

ఇదేమి అరాచకం?!

- కాపాడిన వారిపై బాధితుల చేత అబద్ధాలు చెప్పిస్తారా?
- టీడీపీ అరాచకాలు పెచ్చుమీరుతున్నాయి
- ఖండించిన నూజెండ్ల మండల వైఎస్సార్ సీపీ నాయకులు

వినుకొండ (నూజెండ్ల): నియోజకవర్గంలో టీడీపీ అరాచకాలు పెచ్చుమీరిపోతున్నాయని నూజెండ్ల మండల వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నూజెండ్ల మండల నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ అధికారంలో వచ్చిన తరువాత రషీద్ హత్య, వెంకుపాలెం వద్ద ఒకరి కిడ్నాప్ ఇలా జరుగుతూనే ఉన్నాయన్నారు. నిన్న నూజెండ్ల మండలం ఉప్పలపాడు గ్రామంలో షార్ట్‌సర్క్యూట్ వల్ల పూరిల్లు కాలిపోతే అందుకు నూజెండ్ల వైఎస్సార్ సీపీ కన్వీనర్ నాగిరెడ్డి కారణమని బలవంతంగా ఆ ఇల్లు కాలిపోయిన బాధితుల చేత చెప్పించడం దారుణమన్నారు. నాగిరెడ్డిపైన, ఆ మంటలను ఆర్పడానికి ప్రయత్నించిన వారిపై తప్పుడు కేసులు పెట్టడం సరికాదన్నారు. అమాయకమైన పేదవారిని అడ్డు పెట్టుకొని తమపార్టీ నాయకులపై అక్రమ కేసులు పెట్టడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు పొట్లపల్లి పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పత్తిపంటలో ఆ మందులు వాడితే ప్రమాదమే

యడ్లపాడు: పత్తి పంటలో సింథటిక్ పెరిత్రాయడ్ మందులు వినియోగించరాదని, వీటివల్ల పంటలో రసంపీల్చే పురుగులు ఉధృతి పెరిగే ప్రమాదం ఉందని జిల్లా వనరుల కేంద్రం నుంచి డీడీఏ ఎం శివకుమారి, ఏవో డి ప్రవీణ్ తెలిపారు. మండలంలోని రెండు గ్రామాల్లో మంగళవారం వారు పలు పంటల్ని పరిశీలించారు. స్థానిక రైతులకు అవగాహన కార్యక్రమాల్ని నిర్వహించారు. ఆత్మవారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఆయా కార్యక్రమాల్లో పత్తి, మిరప, మాగాణుల్లో వచ్చే సమస్యలు, వాటి పరిష్కారాలపై సలహాలు, సూచనలు చేశారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

రొంపిచర్ల: స్థానిక భగత్ సింగ్ భవన్‌లో మండలంలోని వివిధ జిల్లా పరిషత్ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులకు దుర్వ్యసనాలు-దేశ ప్రగతిపై వాటి ప్రభావాలు అంశంపై మంగళవారం వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు భగత్ సింగ్ భవన్ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో జరిగాయి. వ్యాసరచన పోటీల్లో 300 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. కమిటీ ముఖ్య కార్యదర్శి సరికొండ రామకృష్ణం రాజు మాట్లాడుతూ సమ సమాజ స్థాపన, దేశ భవిష్యత్ యువత సామర్థ్యంపై ఆధారపడి ఉంటుందన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని వ్యాస రచన పోటీలు నిర్వహించామన్నారు. ప్రస్తుత ఆధునిక యుగంలో యువత మత్తు పదార్థాలకు బానిసలై పెడదోవ పడుతున్న తీరు బాధాకరమన్నారు. యువత క్రమశిక్షణ నియమాలు అలవర్చుకోవాలన్నారు. పోటీలో పాల్గొన్న వారి నుంచి 3 ఉత్తమ వ్యాసరచలను ఎంపిక చేసి ఆగస్టు 15న ఆయా పాఠశాల విద్యార్థులకు అదే పాఠశాలలో నగదు బహుమతి ప్రదానం చేస్తామన్నారు.



బాలికలను బాగా చదివించాలి



క్రోసూరు జెడ్పీపాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



మాదలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి

క్రోసూరు: ప్రతి తల్లిదండ్రులు ఆడపిల్లలను తప్పని సరిగా చదివించాలని, అదేవిధంగా వారిని సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్లు మాధవి, మహిమున్నీసా తెలిపారు. క్రోసూరు జెడ్పీ పాఠశాలలో మంగళవారం బేటీ బచావో, బేటీ పఢావో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్టార్ సూపర్‌వైజర్లు మాట్లాడుతూ భ్రూణ హత్యలు కారణంగా భారతదేశంలోని కొన్ని రాష్ట్రాల్లో లింగ నిష్పత్తి తగ్గుదలకు కారణమైందన్నారు 2001 నుంచి 2011 వరకు జనాభా లెక్కల ప్రకారం మహిళల సంఖ్య తగ్గుదల గమనించవచ్చన్నారు. ప్రధాని మోదీ 2014లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా భ్రూణ హత్యల నిర్మూలనకు పిలుపునిచ్చారని చెప్పారు. భారత ప్రభుత్వం బాలికలను రక్షించండి, చదివించండి నినాదంలో పలు పథకాలు ఏర్పాటు చేసిందన్నారు. లింగవివక్షకు వ్యతిరేకంగా పౌరులకు అవగాహన కల్పించటం, బాలికల సంక్షేమ సేవల సామర్థ్యాన్ని మెరుగుపరచటం, ఈపథకం లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలు, బాలికల అక్రమ రవాణా, మహిళా చట్టాలను గురించి వివరించారు. ఈకార్యక్రమంలో పాఠశాల బాలబాలికలు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

మాదల గురుకుల పాఠశాలలో...

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలో గల ఎంజేపీబీసీఆర్ స్కూల్‌లో ఐసీడీఎస్ సత్తెనపల్లి ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మిషన్‌శక్తి కార్యక్రమంలో భాగంగా ఇరుకుపాలెం సెక్టార్ పరిధిలో భేటీ బచావో-భేటీ పడావో కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు ఓ.అనంతలక్ష్మి, జి.జయలక్ష్మిలు పాల్గొని ఆడపిల్లల హక్కులు, బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలను వివరించారు. బాల్య దశ నుంచే పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మునిరత్నమ్మ, పాఠశాల బోధనా సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీల బలోపేతానికి చర్యలు

సత్తెనపల్లి: పంచాయతీల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని సత్తెనపల్లి ఏఓ బసవ కుమారి అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండలంలోని గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు రెండవ రోజు మంగళవారం నిర్వహించిన శిక్షణలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రజా ప్రతినిధులు గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. గ్రామాల అభివృద్ధికి గ్రాంట్లతో పాటు దాతల సహకారం సద్వినియోగం చేసుకొని గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు, కార్యదర్శులు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా పారిశుద్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, వర్మీ కంపోస్టు తయారీ, మార్కెటింగ్‌పై క్షేత్రస్థాయి పర్యటన, చెత్త నుంచి సంపద తయారీలో భాగంగా సత్తెనపల్లి మండలం అబ్బూరు గ్రామంలోని ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని క్షేత్రస్థాయిలో మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు సందర్శించారు. సర్పంచ్ జి.అన్నపూర్ణమ్మను అభినందించారు. శిక్షణలో ఈవోపీఆర్డీ దయాసాగర్, టీఓటీలు గోలి శ్రీనివాసరావు, అంకమ్మరావు, డీఏ శంకర్‌లు మాట్లాడారు. శిక్షణలో మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



సత్తెనపల్లిలో మాట్లాడుతున్న ఏఓ బసవకుమారి

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి


నకరికల్లు: మండల అభివృద్ధిలో పార్టీలకతీతంగా భాగస్వాములు కావాలని ఎంపీపీ మేచారపు అనురాధ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన ఎంపీపీ అనురాధ మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. మండలంలోని పలుశాఖల అధికారులు వారు చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను శాఖలవారీగా వివరించారు. ప్రధానంగా విద్య, వైద్యం, ఐసీడీఎస్, ఇరిగేషన్, వ్యవసాయం, డ్వాక్రా తదితర శాఖల అధికారులు వివరించారు. వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్‌కుమార్ రెడ్డి, ఎంపీడీఓ కార్యాలయం సూపరింటెండెంట్ ఆర్.కృష్ణానాయక్, వ్యవసాయాధికారి కె.దేవదాసు, ఎంఐఓఎస్ కో-ఆర్డినేటర్ బత్తిన మల్లిఖార్జునరావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



ఎంపీపీ అనురాధ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివరాలు తెలియజేస్తున్న ఎంఐఓఎస్ కో-ఆర్డినేటర్

15 నుంచి వేంకటేశ్వర ఆలయ పుష్కర ఉత్సవాలు

రాజుపాలెం: మండలకేంద్రంలోని రాజుపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న పద్మావతిగోదా సమేత వేంకటేశ్వరస్వామి వారి ప్రథమ పుష్కర ద్వాదశ వార్షికోత్సవాలు ఈ నెల 15వ తేదీ నుంచి 19 వరకు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. దేవస్థానం నిర్వాహకులు, బాలాజీ టెంపుల్ ట్రస్ట్ చైర్మన్ పొత్తూరి వెంకటరమా సుబ్బారావు మహోత్సవాల ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. దేవాలయంను విద్యుత్ దీపాలతో అంగరంగ వైభవంగా ముస్తాబు చేశారు. ప్రతి ఏడాది దేవస్థానం శంకుస్థాపన రోజును పురస్కరించుకుని ఐదు రోజులు ఉత్సవాలను నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి వందలాది భక్తులు హాజరై స్వామిని దర్శించుకుంటారు. ఈ నెల 15వ తేదీన విశ్వక్సేనారాధన, వాసుదేవ పుణ్యాహవచనం విశేష పూజలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం సాంస్కృతిక కార్యక్రమాలు, సాయంత్రం శ్రీకృష్ణతులాభారం పద్యనాటకం, 16వ తేదీన నిత్యారాధన మంగళశాసనం, పూర్ణహుతి మొదలైన పూజా కార్యక్రమాలు. మధ్యాహ్నం మహిళలచే కోలాటం, సాయంత్రం నర్తనశాల పౌరాణిక పద్యనాటకం, 17వ తేదీన స్వామివారి శాంతి కళ్యాణం, అన్నదానం, సాయంత్రం బాలనాగమ్మ జానపద నాటకం, 18వ తేదీ ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, మధ్యాహ్నం మహిళలచే కోలాటం, సాయంత్రం మాయాబజార్ పౌరాణిక నాటకం, 19వ తేదీన బ్రహ్మశ్రీ వెంకట ఫణికుమార్‌శర్మచే వేంకటేశ్వరస్వామి ప్రవచనం, మధ్యాహ్నం స్వామివారి ఊరేగింపు జరుగుతుంది. సాయంత్రం భక్త చింతామణి నాటకం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



విద్యుద్దీపాల కాంతులతో వెలిగిపోతున్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం

ప్రకృతి వ్యవసాయం సాగుకు ఆసక్తిచూపాలి

శావల్యాపురం: రానున్న రోజుల్లో ప్రతి కుటుంబం క్యాన్సర్, షుగర్, గుండె సంబంధిత వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే తప్పనిసరిగా ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన ఆహార పదార్థాలు తినాలని మాస్టర్ ట్రెనర్ తిరుపతిరావు అన్నారు. మంగళవారం స్థానిక మండల సమాఖ్యా కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై గ్రామసమాఖ్యా సంఘాల్లోని మహిళా సభ్యురాలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఇంటిలోని మహిళలు ఆకుకూరలు, కూరగాయాలు పెరటి తోటల్లో పెంచుకొని వాటికి సహాజంగా లభించే ఘనజీవామృతం, తదితర వాటితో సాగు చేయాలని తద్వారా ఆరోగ్యకరంగా ఉండటంతో పాటు ఆర్థికంగా సుస్థిరపడతారన్నారు. ఏస్‌ఎఫ్ఏ సైదయ్య, ఏపీయం జి.వాసుబాబు,సీసీలు బేబి రాణి,రమాదేవి, ఖాజావలీ, ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జ్ లక్ష్మి, సమాఖ్యా అధ్యక్షులు పాల్గొన్నారు.